క్లుప్తంగా

తిరునాళ్లలో కూడా రాజకీయాలా..!



కాకుమాను: టీడీపీ ఎన్నికల నియమావళికి నీళ్లొదిలేస్తున్నారు. మంగళవారం కొండ పాటూరు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా కాకుమానులో ఆ పార్టీ నాయకులు మెడలో పచ్చ కండువాలు ధరించి, తిరునాళ్లకు వచ్చే వారికి పిలిచి మరీ భోజనాన్ని వడ్డించారు. దీంతో పలువురు ఎన్నికల దృష్ట్యా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శించారు.

మాదిగల ఆత్మగౌరవం తాకట్టు సిగ్గుచేటు



నెహ్రూ నగర్: మాదిగల ఆత్మగౌరవాన్ని మందకృష్ణ మాదిగ టీడీపీకి తాకట్టు పెట్టడం సిగ్గుచేటని మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవ పేర్కొన్నారు. మంగళవారం నగరంపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో మాదిగలను అన్ని రకాల ఇబ్బందులకు గురి చేసిన చంద్రబాబుకు ఏ విధంగా మద్దతు ఇస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు కూటమికి ఓట్లు వేస్తే మాదిగలు మరింత వివక్షకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. విజ్ఞత కలిగిన మాదిగలు ఓటుతో టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వీజే వినయ్ కుమార్, వీరారాజు, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం



నగరంపాలెం: ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖ నుంచి ఏదైనా అవసరమైతే నేరుగా సంప్రదించవచ్చునని జిల్లా ఏఎస్పీ(పరిపాలన) జీవీ రమణమూర్తి అన్నారు. మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్ఐలు వెంకటేశ్వరరావు, పాప రాణి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు వి.విజయ్‌కుమార్, జె.సాంబశివరావు, హెడ్ కానిస్టేబుల్ ఎన్వీ సత్యనారాయణ, మినిస్ట్రీరియల్ సిబ్బంది సీహెచ్ ఉమాదేవిలను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో శాలువాలు, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికలు అందించారు. పోలీస్ శాఖకు వారు అందించిన సేవలను జిల్లా ఏఎస్పీ కొనియాడారు. ప్రతి ఒక్కరి జీవితం నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని అన్నారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు శ్రీనివాసరావు, శ్రీహరిరెడ్డి, గుంటూరు అసోసియేషన్ సభ్యులు హసన్, లక్ష్మణ్, మైలా సాంబశివరావు, ఉద్యోగ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఉద్యోగులు పాల్గొంటే చర్యలు

నెహ్రూ నగర్: ప్రభుత్వ ఉద్యోగులు, అప్కాస్ ఉద్యోగులు ఎవరైనా రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొన్నా, ప్రచారం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన నగరపాలక సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆళ్ల అమరేశ్వరరావుని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ సంస్థల్లో విధులు నిర్వహించే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ఏ విధమైన రాజకీయ పార్టీల సభల్లోను, ప్రచార కార్యక్రమాల్లోనూ పాల్గొనకూడదన్నారు. ఇటీవల ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏటుకూరులో టీడీపీ ఏర్పాటు చేసిన రాజకీయ కార్యక్రమంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా రాజకీయ నాయకులకు బొకేలు ఇచ్చి, ఫొటోలు దిగిన నగరపాలక సంస్థ 192వ వార్డ్ సచివాలయం ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆళ్ళ అమరేశ్వరరావుని విధుల నుంచి తొలగించామని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన చేసే వారిని ఉపేక్షించబోమని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు.

అన్ని వర్గాల అభివృద్ధే జగనన్న లక్ష్యం

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి బలసాని
- ప్రతి గ్రామంలో బ్రహ్మరథం పట్టిన పార్టీ శ్రేణులు



కోతివానిపాలెం ఎస్టీ కాలనీలో మహిళలకు కర పత్రాలు అందజేస్తున్న బలసాని

కోతివానిపాలెం(కాకుమాను): అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత 58 నెలల నుంచి పాలన చేశారని, రానున్న రోజుల్లో కూడా అదే పాలన అందించాలనే లక్ష్యంతో ఎన్నికలకు వెళ్తున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని కోతివానిపాలెం, బోడిపాలెం, రేటూరు గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పాలన కంటే మిన్నగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించాలనే ధృడ సంకల్పంతో దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని, చేయని పథకాలతో నూతన మేనిఫెస్టోను ప్రకటించారన్నారు. అమలుకు సాధ్యం కాని పథకాలతో ప్రజలను మభ్యపెట్టాలనే ఉద్దేశంతో కూటమి కుతంత్రాలు పన్నుతోందని ఆయన విమర్శించారు. కూటమి చెప్పే పథకాలను నమ్మే పరిస్థితులో ఎవరు లేరని, కూటమి కుదేలు చేసేందుకు రాష్ట్ర ప్రజలందరు సిద్ధంగా ఉన్నారని బలసాని స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతో కూటమికి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. తొలుత ఆయా గ్రామాల్లోని చర్చిలు, ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివారావు, బోడిపాలెం ఎంపీటీసీ నన్నపనేని లీలా అపర్ణ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కపిల్, గేరా పున్నారావు, మెరిగల రవిబాబు, నలిగల యెషయ్య, బోడిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు దాలు రాజేష్, రేటూరు సర్పంచ్ షేక్ సైదా, సుధాకర్, సుభాని, జాను, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉత్తేజం



వీవీఐటీలో క్రీడాకారులతో బీవీ ప్రసాదరావు తదితరులు

పెదకాకాని: క్రీడలు మానసిక ఒత్తిడిని దూరం చేసి, ఉత్తేజాన్ని కలిగిస్తాయని మనో వేగాన్ని నియంత్రించే శక్తి క్రీడలకు ఉంటుందని ఇండియన్ వాలీబాల్ మాజీ ఛీఫ్ కోచ్ బీవీ ప్రసాదరావు అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్రీడా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు క్రీడలకు దూరంగా ఉండటం వల్ల శారీర ఆకృతిని కోల్పోతున్నారన్నారు. క్రీడలు చదువులో భాగమని, విద్యార్థులకు క్రీడలు తప్పని సరన్నారు. ముందుగా అంతర్ కళాశాల క్రీడల్లో విజేతలకు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. వీవీఐటీ నుంచి కాకినాడ జేఎన్‌టీయూ స్పోర్ట్స్ టోర్నమెంట్ జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల మధ్య స్నేహ సంబంధం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ డాక్టర్ కె.సత్యన్నారాయణ, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్ ఎస్.అరుణ్ కుమార్, డాక్టర్ ఎం.గిరిధర్, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో గొంతెండి వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: మూడు రోజులుగా తిండి తినకుండా మద్యం సేవిస్తూ నిద్రించిన వ్యక్తి మృతి చెందిన ఘటనపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ నరేష్‌కుమార్ వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం, దాళ్ళవలస గ్రామానికి చెందిన కిల్లాన నారాయణరావు, అదే ప్రాంతానికి చెందిన అయినపల్లి సత్యరావు(32) నగర శివారులోని అంకిరెడ్డిపాలెం సమీపంలోని రామచంద్ర కోల్డ్ స్టోరేజ్‌లో కూలీ పనులు చేస్తు అక్కడే ఉన్న వర్కర్స్ గదుల్లో నివశిస్తూ ఉంటారు. ఈ క్రమంలో గత మూడు రోజులుగా పనిలేకపోవటంతో ఇద్దరూ పూటుగా మద్యం సేవిస్తున్నారు. మూడు రోజులుగా భోజనం కూడా చేయకుండా మద్యం సేవిస్తూ ఉండి ఈ నెల 28 రాత్రి మద్యం మత్తులో తోటి కార్మికులతో కలిసి నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారిన తర్వాత అందరూ లేచినా సత్యరావు నిద్ర లేవకపోవటంతో అనుమానం వచ్చి చూడగా మృతి చెందినట్లు గుర్తించారు.పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిర్వహించి మృతుని కుటుంబ సభ్యులకు అందించి, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భూషణానికి డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బయోటెక్నాలజీ పరిశోధకుడు కసుకుర్తి భూషణానికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు రీసెర్చ్‌సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. బయోటెక్నాలజీ పరిశోధనా పర్యవేక్షకులు డాక్టర్ పి.సుధాకర్ పర్యవేక్షణలో 'ఎలక్ట్రోమాగ్నటిక్ ఫీల్డ్ రేడియేషన్ ఇంపాక్ట్ ఆన్ లోకల్ అండ్ సిస్టమాటిక్ టిష్యూస్ విత్ ఐ రెటీనా అండ్ ఆప్టిక్ నెర్వ్స్ ఇన్ రేట్స్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు గాను భూషణానికి డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు.

షిరిడిలో మెరిసిన తెలుగు తేజాలు

సాయి నృత్యోత్సవ్- 2024లో ప్రతిభ చూపిన నృత్య కారిణులు



షిర్డీలో వేదికపై ప్రదర్శన ఇచ్చిన నృత్య కారిణుల బృందంతో నాట్య గురువు అనుశేఖర్

గుంటూరు ఎడ్యుకేషన్: షిరిడిలో నిర్వహించిన జాతీయస్థాయి నృత్య ప్రదర్శనల్లో తెలుగుతేజాలు మెరిశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నృత్యకారిణులతో పోటీపడి, గుంటూరు కళా ప్రతిభ చాటారు. ఈనెల 27, 28వ తేదీల్లో షిరిడిలో సాయి నృత్యోత్సవ్–2024 పోటీలను నిర్వహించింది. శ్రీసాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ అధికారికంగా జాతీయస్థాయిలో నిర్వహించిన నృత్య పోటీలకు షిరిడిలోని సాయి శతాబ్ది మండపం వేదికగా నిలిచింది. పోటీల్లో పాల్గొన్న గుంటూరు శ్రీనగర్ ఏడోలైనుకు చెందిన అను డ్యాన్స్ అకాడమీ నృత్య కారిణుల బృందం అక్కడ అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. నాట్య గురువు అనుశేఖర్ పర్యవేక్షణలో 12 మంది నృత్యకారిణులు అత్యంత క్లిష్టమైన ''కళింగనర్తన'' (కాళీయమర్ధన) ప్రదర్శనతో షిరిడిలోని తెలుగు వారితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు, విదేశీ పర్యాటకులను ఆకర్షించారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన నృత్య కారిణులు బృందం వారి నాట్య గురువు అనుశేఖర్ సారథ్యంలో ఇప్పటికే రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీకాళహస్తి, కాణిపాకం, విజయవాడతో పాటు గుంటూరు జిల్లాలోని పెదకాకాని, తదితర దేవాలయాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

జీజీహెచ్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజి వార్డు

- మే నుంచి నిరంతర సర్జికల్ గ్యాస్ట్రో సేవలు
- సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్



సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పది పడకల సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజి వార్డును కేటాయించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలోని పలు విభాగాధిపతులతో సూపరింటెండెంట్ చాంబర్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వార్డు, ఆపరేషన్ థియేటర్, సిబ్బంది కేటాయింపుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పాదిల ప్రసాద్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో పది పడకల సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజి వార్డును తాత్కాలికంగా కేటాయిస్తున్నట్లు చెప్పారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి ఒక వైద్యుడుతో పాటు, సహాయకులను కూడా నియమిస్తున్నామని చెప్పారు. మే నుంచి నిరంతరంగా సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోటి వెంటకటేశ్వర్లు, సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆషా సజని పాల్గొన్నారు.

శ్రామిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం



కర పత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్ : శ్రామిక దినోత్సవం మే 1న ఘనంగా జరుపుకోవాలని మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ ఓనర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని నులకపేట యూనియన్ ఆఫీస్‌లో ప్రగతిశీల కార్మిక సమాఖ్య తీసుకు వచ్చిన మేడే కరపత్రాన్ని నాయకులు, డ్రైవర్స్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల కార్మిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి బి. కొండారెడ్డి మాట్లాడుతూ 138 ఏళ్ల క్రితం శ్రమ దోపిడీపై శ్రామికవర్గం తిరుగబాటుతో మే డేకు అంకురార్పణ జరిగిందని తెలిపారు. 1886లో చికాగో నగరంలో హె మార్కెట్ వద్ద లక్షలాది మంది కార్మికులు 8 గంటల పని విధానం కోసం ఆందోళన మొదలు పెట్టారని, మే 3న 3 లక్షల మంది కార్మికులు రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేసిన క్రమంలో పోలీసులు కాల్పులు జరిపారని, ఈ కాల్పులలో వందలాది మంది కార్మికులు తమ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కార్మిక వర్గ పోరును రక్తాక్షరాలతో లిఖంచిన రోజుకు గుర్తుగా మే 1న మేడే పోరాట దినంగా జరుపుకుంటున్నామని వివరించారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎస్కే శ్రీను, యూనియన్ నాయకులు ఎస్కే. జాన్ సైదా, ఎస్కే. ఖాసిం, ఎస్కే. సైదా, జి. నివాసరావు, బి.వరప్రసాద్, బి.కృష్ణ, ఏడుకొండలు, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి, పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 565 మార్కులు సాధించిన విద్యార్థినిని మంగళవారం మండల యూటీఎఫ్ శాఖ కార్యవర్గం అభినందించింది. ఈ సందర్భంగా రాష్ట్ర శాఖ సహాధ్యక్షురాలు కె. నాగ కుసుమకుమారి మాట్లాడుతూ దుగ్గిరాల జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని నేలవల్లి మీనాక్షి 565 మార్కులు సాధించిందని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించినందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మహమ్మద్ గయాసు దౌలా, మండల శాఖ ప్రధాన కార్యదర్శి బి. చలపతిరావు, ఆర్.వి. ప్రసాద్, సతీష్‌బాబు, ప్రభాకరరావు, కె.కామాక్షి, సుధాకర్, నాగలక్ష్మి, పద్మావతి, నాగరాజు, శోభారాణి, శ్రీనివాసరావు, హేమసుందర్, హుస్సేన్ పాల్గొన్నారు.

అందరికి మేలు చేసేలా వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో

వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ



మురళీకృష్ణకు ఘన స్వాగతం పలుకుతున్న గ్రామ నాయకులు



మురళీకృష్ణకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

పొన్నూరు: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో ప్రజలందరికీ మేలు చేసేలా ఉందని, అమలు చేయగలిగిన సంక్షేమాన్ని మాత్రమే మేని ఫెస్టోలో పొందుపరిచినట్లు వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మండలంలోని వడ్డిముక్కల, జడవల్లి, కట్టెంపూడి, తాళ్లపాలెం, కొండమూది, ఆలూరు గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు హారతులుపట్టి, నాయకులు పూలమాలలు వేసి మురళీ కృష్ణకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రచార వాహనంలో మురళీకృష్ణ మాట్లాడారు. మేనిఫెస్టో ప్రకటన తర్వాత సీఎం జగన్‌పై ప్రజలకు నమ్మకం మరింత పెరిగిందన్నారు. అందువల్లే సభలకు జనం పోటెత్తుతున్నట్లు చెప్పారు. చంద్రబాబు అమలుకు నోచుకోని ఎన్ని హామీలిచ్చినా ప్రజానీకం నమ్మే పరిస్థితి లేదన్నారు. పొన్నూరులో టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ళపై ఘన విజయం సాధిస్తానని అంబటి ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతో ఆయన సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తున్నట్లు విమర్శించారు. టీడీపీ నాయకులు తాము గెలిచిపోతున్నట్లు ప్రచారం చేసుకుంటూ అందుబాటులో ఎవరుంటే వారికి కండువాలు వేసి, లెక్కలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పేదలు తమ వెంటే ఉన్నారని. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్షగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వడ్రాణం ప్రసాద్, అమిరినేని సాంబశివరావు, షేక్. నాజర్, బోయి నాగరాజు, సర్పంచ్ లు జాలాది యానాది రావు, వీరయ్య, వడ్రాణం చలపతి రావు, సర్దార్, పిల్లి మాణిక్యరావు, కోటేశ్వరరావు, ఆదిశేషులు, నాగేశ్వరరావు, శివనాగులు, శంకర్ పాల్గొన్నారు.

వెనిగండ్లలో 29 మంది వలంటీర్ల రాజీనామా

పెదకాకాని: మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన షేక్ ఫాతిమా, కొండమడుగుల అనూష, షేక్ రిజ్వాన్, పఠాన్ బషీరున్, షేక్ మెహబూబ్ బాషా, మున్నంగి శివపార్వతి, చీడిపూడి లావణ్య, షేక్ ఆసిఫ్ బాషా, సూరవరపు శ్రీకాంత్, కంచర్ల నాగమణి, తోకల శిరీష, మేడా తిరుపతమ్మ, కొల్లి వినీల, పులగం శ్రావణి, పల్లెబోయిన జయలక్ష్మి, దుర్గం సాయిహర్ష తమ రాజీనామాలను ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావుకు మంగళవారం అందజేశారు. అలానే విప్పల తులసి, షేక్ అమీరున్, కాకాని భాగ్యలక్ష్మి, పాతూరి మాచ్యూస్, బుల్లా కిరణ్‌కుమారి, బుల్లా వనిత, బుల్లా రాణి, బుల్లా శిరీష, శ్రీపాటి మణిరత్నం, ఆత్మకూరి సందీప్‌రెడ్డి, శీలం దుర్గారావు, ఆరుమళ్ళ మురళిరామకృష్ణారెడ్డి, బాణావత్ లక్ష్మీబాయి ఎంపీడీఓ కార్యాలయంలో తమ రాజీనామాలను సమర్పించారు. 29 మంది రాజీనామా చేసి, వలంటీర్లపై టీడీపీ నాయకుల కక్ష సాధింపు చర్యలు చేపట్టడం, టెర్రరిస్టులతో పోల్చడం, పింఛను కూడా ఇవ్వకుండా అడ్డుకోవడం వంటి చర్యలను ఖండించారు.

ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన



సమావేశంలో డాక్టర్ షమ సుల్తానా, షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రిన్సిపల్ రత్తయ్య

గుంటూరు మెడికల్: షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో వరంగల్‌లో పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు భవిష్యత్ కార్యాచరణపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్, యువ నారి హెల్త్ కేర్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు ఎటువంటి కోర్సులు ఎంచుకుంటే భవిష్యత్‌లో ఎటువంటి ఉపాధి అవకాశాలు లభిస్తాయో అనే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ భావి భారత భవిష్యత్ ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలు నేటి విద్యార్థులే అన్నారు. విద్యార్థులు వారు ఎంచుకునే కోర్సులు పైనే వారి భవిష్యత్ ఉంటుందన్నారు. ఏ కోర్సు చేస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయో తదితర విషయాల గురించి ఈనెల 15వ తేదీ నుంచి హోప్ విన్ హాస్పిటల్స్, యువ నారి హెల్త్ కేర్ ఆధ్వర్యంలో యూట్యూబ్, ఫేస్ బుక్, ఇన్ స్టాగామ్ అప్లోడ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్ స్టిట్యూషన్ ప్రిన్సిపాల్ రత్తయ్య పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్ స్టిట్యూషన్స్ యాజమాన్యం డాక్టర్ షమ సుల్తానాను శాలువాతో ఘనంగా సత్కరించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణంలో పాల్గొన్న దంపతులు



హాజరైన భక్తులు


నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు నారాయణం ప్రసాదాచార్యులు, గుదిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. మర్రెడ్డి రామకృష్ణారెడ్డి, మృదుల దంపతులతో వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. లోక కల్యాణం, విశ్వ శ్రేయస్సును కాంక్షిస్తూ ఉభయదేవేరి సమేతుడైన స్వామి ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రధాన అర్చకులు పరుచూరి మాధవస్వామి బృందం వైభవంగా కల్యాణాన్ని జరిపించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ఆవుల అచ్యుతరామయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

మంగళగిరి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మంగళగిరి నియోజకవర్గ కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్‌లను మంగళవారం ఎన్నికల పరిశీలకులు నీరజ్‌కుమార్, అసెంబ్లీ నియోజకవర్గ రిటరినింగ్ అధికారి రాజకుమారి పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్ వద్ద చేపట్టనున్న ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు. పోలింగ్ ముగించుకుని వచ్చే వాహనాలకు విశ్వవిద్యాలయ పరిధిలో ఎటువంటి ట్రాఫిక్ సమస్య కలుగకుండా ప్రణాళికాబద్ధంగా చేపట్టిన ఏర్పాట్ల గురించి ఎన్నికల పరిశీలకులకు వివరించారు. అనంతరం రిటర్నింగ్ అధికారి రాజకుమారి తన కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిక్ సర్వైలయన్స్ టీమ్స్ లైవ్ స్ట్రీమింగ్‌లు పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇద్దరికి గాయాలు



మృతుడు రామారావు

చేబ్రోలు: గుర్తుతెలియని లారీ ఆటోను ఢీ కొట్టడంతో ఒకరు మరణించగా.. మరో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని వడ్లమూడి గ్రామ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. గుంటూరు పట్టణం సంగడిగుంట ప్రాంతానికి చెందిన జి.రామారావు(56) ఘటనలో అక్కడక్కడే మరణించాడు. గుంటూరు ప్రాంతానికి చెందిన రామారావు స్టీలు సామాను వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. వ్యాపార పనుల నిమిత్తం తెనాలి వెళ్లి ఇంటికి ఆటోలో తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో వడ్లమూడి గరువుపాలెం సమీపంలోని చాణక్య స్కూలు ఎదురుగా గుర్తుతెలియని లారీ ఆటోను ఢీ కొట్టి వెళ్లిపోయింది. రామారావు అక్కడక్కడే మృతి చెందగా.. డ్రైవర్ రమావత్ శ్రీను నాయక్‌తో పాటు నారాకోడూరు గ్రామానికి చెందిన తోట నాగేశ్వరరావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు.